స్ఫురించింది. ఆమె మోముపై ఆత్మవిశ్వాసంతో కూడిన చిరునవ్వు రేఖామాత్రంగా జాయపునికి కనిపించింది.

''వాతాపి గణపతింభజే.. హం..''

స్వామికి నమస్కరిస్తున్నట్లు కళ్లు మూసి మంద్రంగా మొదలెట్టింది. అంతా స్పందనీయ ముఖాలతో ఆసక్తిగా చూస్తున్నారు.

''వాతాపి గణపతిం భజేహం..

వారణాస్యం వరప్రదం.. శ్రీ॥''..

దేవుని కీర్తన కాబట్టి లాస్యయుతంగా చిన్నచిన్న పాద కదలికలతో రేచకాలతో అతని శరీరం కదలడం మొదలయ్యింది. రెండడుగులు వేశాడో లేదో అందరూ కరతాళ ధ్వనులతో తమ స్పందన చెప్పారు. అతని కాలిగోరు నుంచి తల ఆఖరి వెంట్రుక వరకూ పూర్తిగా అతని స్వాధీనం. అన్నీ కలిసిమెలసి నర్తిస్తాయి. అందుకే అతని కరణులు ముగ్ధత్వాన్ని వెలార్చుతాయి. అందరూ చూసేది అతని ముఖంలో తేజరిల్లే చిన్మృదతో కూడిన హావభావ విన్యాసం. అది అందరినీ అటు గుంజుకుని కట్టి పడేస్తుంది.

''వాతాపి గణపతిం భజేహం..

వారణాస్యం వరప్రదం..

భూతాది సం సేవిత చరణం

భూతభౌతికా ప్రపంచభరణం –

వీత రాగిణం – వినుత యోగినం –

విశ్వ కారణం – విఘ్నవారణం.. ॥వా॥''

వినాయక స్తుతి అందరికీ సుపరిచితమే కాబట్టి అందరూ పెదవులు కదలిస్తూ ఇంద్రాణి గమకం వేసినప్పుడు తన్మయంతో తలలూపుతూ చేయితో తొడపై తాళంవేస్తూ జాయపుణ్నే చూస్తున్నారు. ఆ స్తోత్రంలోని దేవుని ఆరాధనకు తగ్గట్లు సున్నితంగా లాస్య ప్రధానంగా కదులుతున్నాడు జాయపుడు. మోములో భక్తి.. శరీర కదలికల్లో వినయం.. మొత్తంగా నాట్య విన్నాణం ఎవ్వరినీ రెప్ప వెయ్యనివ్వడంలేదు.

''పురా కుంభ సంభవ మునివర ప్రపూజితం –

త్రికోణ మధ్యగతం –

మురారి ప్రముఖాద్యుపాసితం –

మూలాధారా క్షేత్ర స్థితం –

పరాది చత్వార వాగాత్మకం –

ప్రణవ స్వరూప వక్రతుండం –

నిరంతరం నిఖిల చంద్ర ఖండం –

నిజవామకర నిధృతేక్షుదండం –

కరాంబుజ బీజ హస్తః పూరం –

కలుషవిదూరం – భూతాకారం –

అనాది గురుగుహ క్షోభిత బింబం –

హంసధ్వని భూషిత హేరంబం.. ॥వా॥''..

ఆ ఐదు నిమిషాలు ఆ భవనం ఓ అనిర్వచీయమైన కళా స్రవంతిలో మునకలు వేసింది.

అందరూ ఆఖరులో అద్వితీయ కళాతృప్తిని ఆస్వాదించినట్లు కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. అంతా ఇద్దరినీ ఎవ్వరూ తక్కువ కాదన్నట్లు అభినందనగా చూస్తూ ముగింపుగా భావిస్తున్నారు.

అప్పుడు మొదలైంది అసలు కథ..

జాయపుడు అందరికీ వినయంగా చేతులు జోడిస్తుండగా.. ఇంద్రాణి మరొకసారి గొంతు సవరించుకుని మళ్లీ గళం విప్పింది. మందిరమంతా ఉద్వేగంగా చూసింది. జాయపుడు తెల్లబోయాడు.

''నీలకంఠం..''

దీర్ఘంగా రాగ ప్రస్తారం చేసి..

''నీలకంఠం.. భజేహం..''

ఉచ్ఛస్వరంతో నీలకంఠుని భజిస్తూ.. 'దీర్ఘస్రవిత'తో గానం మొదలుపెట్టింది ఇంద్రాణి.

అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా.. గణపతిదేవుడు ముందుగా తెప్పరిల్లి జాయపను..

'చూస్తావేం.. మొదలెట్టు!' అన్నట్లు కుడిహస్తం ఎత్తి రెచ్చగొట్టాడు.

జాయపునికి రుద్రుడంటే పూనకమే! మొదలుగా చిన్నగా ఎగిరి స్థానకం తీసుకుని.. శివునికి నమస్కరిస్తున్న భంగిమ పెట్టాడు. ఆమె కూడా ఉద్వేగంతో పాటను కొనసాగించింది.

''నీలకంఠం భజేహం – సతతం నీరజాసనాదినుతం – బాలా కుచాంబసహితం

బాలచంద్ర సేవితం – శీల గురుగుహ పూజితం – శ్రీ కదంబ వనవాసం ॥నీ॥''

అందరూ ఏదో కేవలం అన్వయంతో ఇద్దరి అద్భుత కళాప్రజ్ఞ చూశాం అనుకుంటే.. ఆ ఇద్దరూ ఇప్పుడు చిన్న యుద్ధానికి దిగారు అన్నట్లుంది వారి గాన – నాట్య విన్యాస విశేషం.

నాట్యంలో ఇప్పుడు కొంచెం వేగం పెంచాడు జాయపుడు. పదాలలోని పరిమళాన్ని ముఖంలో చూపడం వల్ల అందరూ జాయపుణ్నే చూస్తున్నారు.

''అక్షయ రూప ఖండ కావేరీతీరోత్తరాభిముఖం –

పంచముఖం –

రక్షిత భక్త ప్రముఖం – నక్షత్రేశ శేఖరం –

నామరూప విచిత్రాదళం –

దక్షకరమీశ్వరం – కేదారగౌళ ప్రియకరం –

దక్షిణ కాశీపురం –

దండిత కామ త్రిపురం – దక్షాధ్వరహరంహరం –

దయాకరం – కమలకరం –

సానిద పామగ.. రిగరిస..

నీధప.. మపనిస.. రిమగరి..

మాపని.. దప.. మపనిసరిరి..

మగగరి.. సపధప.. నినిసా..''

ఆమె శాస్త్రీయతకు తగ్గట్లు వడివడిగా కరణులను మార్చుకుంటూ శరీరాన్ని మరింతగా విస్తృతపరచుకుంటూ.. ఆమెపై ఆధిపత్యం కొనసాగిస్తున్నాడు.

''నీసరి .. మాగరి – గారిస ।

నిసరిగ.. రిస.. సరిసరి ధప..

నిసానిధప.. ధపా మగరి

మప.. నిసారిగరి..''

ఆమె పూర్తిచేశాక మరో రెండు అభినయాలు చూపి నిలిచాడు జాయపుడు.

ఇద్దరూ ఎవరికి ఎవరూ తీసిపోని విధంగా రెండు మహా కళారూపాలను తమతమ ప్రతిభతో ఉధృతస్థాయికి తీసుకెళ్లి.. ఆహూతులను సంభ్రమాశ్చర్య ఆనందాలలో ముంచి లేపారు.

అందరి కరతాళధ్వనుల అభినందన మందారమాలలతో ముంచెత్తుతున్నవేళ.. జాయపుడు, ఇంద్రాణి ఒకరినొకరు అభినందనగా 'శభాష్!' అన్నట్లు చూపులతోనే మాట్లాడుకున్నారు.

ఆ కదలికల్లో జాయపుడు ఆమెకు దగ్గరగా వెళ్లి..

''ఏమో అనుకున్నాను.. మంచి గాయనివే కాదు మంచి యోధురాలివి కూడా..'' అన్నాడు.

''మహా నాట్యయోధులు జాయపులతో యుద్ధం చేస్తేనే కదా మజా.. మాధుర్యమూనూ..'' అన్నది జవాబుగా.

అప్పటికే అందరూ చుట్టుముడుతుండటంతో దూరం జరగక తప్పలేదు. అప్పటికే దగ్గరగా వచ్చిన నారాంబ..

''అమ్మాయి బావుంది కదురా జాయా..!?'' అన్నది.

ఆమెకు జవాబివ్వకుండా నవ్వి.. అక్కను బావగారి వద్దకు లాక్కుని పోయాడు.

అప్పటికే గణపతిని బంధుమిత్రాదులు అభినందిస్తుండగా ఆయన..

''ఏమనుకున్నారు.. గుండయామాత్యులవారి శిక్షణ..'' అనడం జాయపుని చెవిన పడింది.

నారాంబ తమ్ముని ముఖాన పట్టిన చెమటను తన పైట చెంగుతో ఆప్యాయంగా తుడుస్తూ..

''నీకు ఆమె పాట నచ్చిందేమో గానీ.. నాకు మాత్రం ఆ అమ్మాయే బహు బాగా నచ్చిందిరా!'' అన్నది.

తమ్మునికి మాత్రమే వినిపించేలా అంటూ అతని కళ్లలోకి చూస్తూ.. జవాబును ఆశిస్తున్నది నారాంబ. అప్పటికి ఆమెకు ఓ వందమంది అమ్మాయిలు బహు బాగా నచ్చారు. ఇంద్రాణి నూటొక్కటి. జాయపుడు కనురెప్పలు అల్లార్చి మౌనంగా ఊరుకున్నాడు.

అప్పుడే అందరూ ఒక్కరొక్కరుగా నిష్క్రమిస్తున్నారు. తల్లిదండ్రులతో వెళ్తూ మందిరం దాటుతూ జాయపుని చూస్తూ.. వెళుతున్నది ఇంద్రాణి. జాయపుడు కూడా కళ్లతోనే వీడ్కోలు చెప్పాడు. క్షణికంలో మెరిసి లిప్తకాలమే కనువిందు చేసిన ఆమె బుగ్గల్లోని మెరుపు.. కరవాలంలా అతని గుండెల్లో మెత్తగా దిగింది.

''నిన్నే చూస్తున్నదిరా జాయా..'' నారాంబ సంబురానికి అంతే లేదు.

గణపతిదేవుడు పిలిచాడు..

''జాయా.. వెళదామా..?!''

ముగ్గురూ కదిలారు. ఎవరి సంభ్రమంలో వారు..

అశ్వం అధిరోహించబోతూ దూరంగా కాగడా వెలుతురులో ఇంద్రాణితో ఓ యువకుడు ఆత్మీయంగా నడుస్తూ వెళుతుండటం జాయపుని కంటపడింది.

* * *

దాదాపు సంధ్య కావస్తున్నది. చీకట్లు మెలమెల్లగా చిక్కబడుతున్నాయి. అశ్వంపై పోతూ అటూ ఇటూ చూస్తున్నాడు జాయప. అనుమకొండ వదలి చాలా దూరం వచ్చేశాడు. ఓ గ్రామం దగ్గరగా వచ్చాడు.

''ఆయన చెప్పిన గ్రామం ఇదేనంటావా.. విక్రమా?!!'' అన్నాడు.

ఎవ్వరూ లేకుంటే అశ్వం విక్రమతో చెప్పుకొంటాడు. చిన్నగా సకిలించి ముందుకురికింది విక్రమ.

చిన్న గ్రామం.. అటూ ఇటూ చూస్తూ పోతుండగా ఎవరో నివాసి అడిగాడు..

''ఎవరి కోసం వచ్చిరు?''.

ఏం చెప్పాలో తెలియలేదు జాయపునికి. ఓ మహిళ అద్భుతంగా జానపదాలు ఆలపిస్తుందని గురుకులంలో చెప్పాడొక విద్యార్థి. అతనిచ్చిన గ్రామ వివరణతో వెంటనే బయల్దేరి వచ్చేశాడు. కొత్త పాటలు, నాట్యాలు, శబ్ద సౌందర్యంతో అలరించే వాయిద్యాలు అంటే.. వాటి గురించి వింటే.. ఆగలేడు.

''ఒకామే.. పాటలు..''

''ఔ.. ఔ! మంచిగ పాడుద్దిలే! సాంభయ్య మూడో పెళ్లాం.. ముందుకు పో! ఆడ గిట్ల తిర్గితే ఆడనే గుడిసె..''

కళ్లెం కదిలించాడు. అర్థమైనట్లు విక్రమ ముందుకు కదిలింది. అప్పుడే ఉచ్చస్వరం వినిపించింది.

''అమ్మోరూ దండాలమ్మో..

హయ్యలో దండాలమ్మో!''..

ఆగిపోయాడు. ఊరు ఊరంతా వినిపించేంత ఉచ్చస్వరం.. ఆశ్వికుని మనసు తెలిసిన విక్రమ గిట్టలశబ్దం వినిపించనంత మెల్లగా వెళుతున్నది. ఆమె తర్వాతి పాట కోసం చెవులు రిక్కించి చూస్తున్నాడు జాయపుడు. దూరంగా గుడిసె.. అదే కావచ్చు! ■

**(సశేషం)**